హిందూ శ్మశానవాటికలు కబ్జాకాకుండా చూస్తాం



శ్మశానవాటికను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్ కుమార్

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని అరుంధతికాలనీ, కృష్ణారెడ్డినగర్‌లలోని హిందూ శ్మశానవాటికలు కబ్జాకు గురయ్యాయని బీజేపీ నాయకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బండ్లగూడ మండల తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా బీజేపీ డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్ కబ్జాకు గురైన స్థలాన్ని తహసీల్దార్‌కు దగ్గరుండి చూపించారు. ప్రభుత్వ స్థలాలతో పాటు శ్మశానవాటికలు కబ్జాకు గురికాకుండా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. త్వరలోనే రెండు శ్మశానవాటికలలో సర్వే చేపడుతామన్నారు. బీజేపీ నాయకులు కొడీ సురేందర్, వెంకటేష్, సురేష్, దేవేందర్, బాలు పాల్గొన్నారు.

యువ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: రంగస్థల నటులు జీఎల్ నర్సింహారావు యువ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. రంగస్థల కళల శాఖ ప్రతి ఏడాది మార్చి 27న ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని నిర్వహిస్తోందన్నారు. అందులో భాగంగా జీఎల్ నర్సింహారావు పేరిట యువ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. నాటక రంగంలో నటన, దర్శకత్వం, మేకప్, లైటింగ్ తదితర సాంకేతిక అంశాల్లో కృషి చేసిన 35 ఏళ్లలోపు ఉన్న యువత దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తులను రిజిస్ట్రార్, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయానికి లేదా పోస్టులో అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ దరఖాస్తులను మార్చి 10వ తేదీలోగా అందజేయాల్సి ఉంటుందని తెలిపారు.

పనులు వేగవంతంగా చేపట్టాలి



అబిడ్స్: వాటర్‌బోర్డు అధికారులు వేగవంతంగా పనులు చేపట్టాలని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. పలు ప్రాంతాల్లో మంచినీటి సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. గురువారం ఎంజేమార్కెట్ రిసాలాబ్జుల్లా ప్రాంతంలో ఆయన పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆనంద్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ... నియోజకవర్గంలో డ్రైనేజీ సమస్య ఉన్నప్పటికీ అధికారులు మరమ్మతులు చేయడం లేదన్నారు. వెంటనే మంచినీరు, డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బస్తీవాసులు కిశోర్, నరేష్ గౌడ్, కిశోర్ సింగ్ రాజ్ పురోహిత్, సునిల్ అగర్వాల్, కిరణ్‌కుమార్, మహేష్ అగర్వాల్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఆన్‌లైన్ లాసెట్ కోచింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నాంపల్లి: ఉచిత ఆన్‌లైన్ లాసెట్ కోచింగ్-2025కు ఆసక్తి కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీఎస్ఏ అకాడమీ డైరెక్టర్ బషీర్ అహ్మద్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక పత్రికా ప్రకటనలో కోచింగ్ వివరాలను వెల్లడించారు. న్యాయవాదవృత్తిని కోరుకునే వారికి ఈ కోచింగ్ ఎంతగానో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. మార్చి 21వ తేదీ నుంచి ఉచిత ఆన్‌లైన్ లాసెట్ కోచింగ్ తరగతులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఈ కోచింగ్‌లో చేరదలచుకున్న అభ్యర్థులు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. ఇంటర్ సెంకడియర్ పరీక్షలు రాసిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు, డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మూడేళ్ల ఎల్ఎల్‌బీ కోర్సును చేయవచ్చని పేర్కొన్నారు.

ఆస్ట్రేలియా ప్రతినిధులతో ఓయూ అధికారుల చర్చలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు గురువారం ఆస్ట్రేలియా సర్టిఫైడ్ అకౌంటెంట్స్ (ఏసీసీఏ) ప్రతినిధుల బృందంతో చర్చలు జరిపారు. కామర్స్ విభాగంలో బోధన, పరిశోధనలు, అకడమిక్, శిక్షణ భాగస్వామ్యంతో పాటు పలు రంగాల్లో పరస్పర అవగాహన ఒప్పందాల పై ఉన్న అవకాశాల గురించి చర్చించినట్లు పేర్కొన్నారు.

మాతృభాషే మధురం

- సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాలభాస్కర్
- ఘనంగా అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ రజతోత్సవాలు



చార్మినార్: మన భావాలు, ఆలోచనలను మాతృభాషలోనే ప్రకటించటానికి ఇష్టపడతామని సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య పి.బాల భాస్కర్ అన్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ రజతోత్సవాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక సదస్సులో ఆయన విద్యార్థులు, అధ్యాపకులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఒక రోజు ముందుగానే కాలేజీలో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, మధుర, భోజ్‌పురి, కోయ, గోండి, బంజారా, పంజాబీ, మలయాళం, ఒడియా, మైథిలి భాషల విద్యార్థులు తమ సంస్కృతి, తమ ప్రత్యేక పండుగలు, కుటుంబ సంబంధాలు, మానవ సంబంధాలు, సిటీ కళాశాలపై తమ అభిప్రాయం తదితర అంశాలను తమ మాతృభాషలో వ్యక్తీకరించారు.

సిటీ కాలేజీ మినీ ఇండియా..

సిటీ కాలేజీలో రాష్ట్రంలోని 33 జిల్లాల విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు. ఇదొక మినీ తెలంగాణగా గుర్తింపు పొందిందన్నారు. ఈరోజు మాతృభాష దినోత్సవ సదస్సులో పద్నాలుగు భాషల విద్యార్థులు పాల్గొని తమ మాతృభాషలలో మాట్లాడటం అనిర్వచనీయమైన అనుభూతిని ఇచ్చిందన్నారు. ఇప్పుడు సిటీ కాలేజీని మినీ ఇండియాగా పేర్కొనవచ్చని అన్నారు. ఇటీవల కాలేజీని సందర్శించిన నాక్ బృందం కూడా ఈ అరుదైన విశేషాన్ని అభినందించిందని గుర్తుచేశారు.

అమ్మ భాషలో మాట్లాడితేనే సంతృప్తి..

బహుభాషలకు నిలయమైన సిటీ కాలేజీలో చదువుకోవటం వల్ల అనేక భిన్న సాంస్కృతిక, ప్రాపంచిక విశేషాలను తెలుసుకోగలుగుతున్నామని విద్యార్థులు అభిప్రాయపడ్డారు. అమ్మ భాషలో మాట్లాడితేనే సంతృప్తిగా ఉంటుందన్నారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఉర్దూ భాషలలో పదప్రహేళిక, వీరి వీరి గుమ్మడి పండు వీరి పేరేమి? మీకు తెలిసిన సామెతలు, తారుమారైన పదం తదితర భాష సంబంధిత పోటీలను నిర్వహించారు. ఐక్యూఏసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సును డా. జె.నీరజ నిర్వహించారు. ఈ సదస్సులో వైస్ ప్రిన్సిపాల్ డా.విప్లవ దత్ శుక్లా, డా.కోయి కోటేశ్వరరావు, అవధానం సుజాత, డా.సూర్యనారాయణ మూర్తి, డా.అనంత లక్ష్మి, డా.కమల సుధారాణి, డా.సుజాత అజ్మీరా, డా.రాజేంద్ర కుమార్, డా.అజరార్ ఉల్ హక్, డా.ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

భద్రతకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి

- ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్
- పరిశ్రమలు – అగ్నిప్రమాదాలపై అవగాహన సదస్సు

నాంపల్లి: తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టీసీసీఐ), మౌలిక సదుపాయాలు, రియల్ ఎస్టేట్ అండ్ స్మార్ట్ సిటీస్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'పరిశ్రమలు – ఫైర్‌సేఫ్టీ'పై సదస్సు జరిగింది. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు సురేష్‌కుమార్ సింఘాల్ అధ్యక్షతన జరిగిన సదస్సుకు తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి, తెలంగాణ ఫైర్ సర్వీసెస్ రిటైర్డ్ డైరెక్టర్ సి.లక్ష్మీప్రసాద్, సినర్జీ ఇన్‌ఫ్రా కన్సల్టెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ వి.శ్రీనివాస్ హాజరై ప్రసంగించారు. భద్రత అనేది ఉమ్మడి బాధ్యతని అన్నారు. నియంత్రణ సంస్థలు అగ్ని ప్రమాదాల భద్రత చర్యలు ప్రభావవంతంగా అమలయ్యేలా చూసుకోవాలని కోరారు. విద్యుత్ మౌలిక సదుపాయాలపై ఆధారపడటం వలన ప్రమాదాలు పెరిగాయని అన్నారు. ఉత్పాదక సదుపాయమైనా, కార్యాలయ సముదాయమైనా, నివాస భవనమైనా భద్రతకు ఎల్లప్పుడూ అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

◆ తెలంగాణ ఫైర్ డిజాస్టర్ రెస్పాన్స్ ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలు, నిబంధనలు, సన్నద్ధత గురించి విశ్లేషించారు. సినర్జీ ఇన్‌ఫ్రా కన్సల్టెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ మాట్లాడుతూ.. అగ్నిమాపక విపత్తు నిర్వహణను వివరించారు. అలాగే తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ రిటైర్డ్ డైరెక్టర్ సి.లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ... భద్రత, సమ్మతి వంటి కీలకమైన అంశాలపై అవగాహన కల్పించారు.



అవగాహన సదస్సుకు హాజరైన వక్తలు

క్రీడారంగానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి

అబిడ్స్: క్రీడారంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వాలని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు పప్పుమాత్రే, ఆనంద్‌సింగ్ అన్నారు. క్రీడాకారులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే విధంగా ప్రభుత్వం సహకరించాలని కోరారు. గురువారం తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో జరిగిన శివాజీ కుస్తీపోటీల్లో వారు పాల్గొని ప్రసంగించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో క్రీడాకారుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిందన్నారు. పాతబస్తీలో క్రీడామైదానాలు అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వారిని సత్కరించారు.

సిరిపురం యాదయ్యకు నివాళి



యాదయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బోనాల శ్రీనివాస్ తదితరులు

అఫ్జల్‌గంజ్: త్యాగాలతోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని ప్రజా ఏక్తా పార్టీ జాతీయ అధ్యక్షుడు బోనాల శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర సాధన కోసం తన ప్రాణాన్ని త్యాగం చేసిన సిరిపురం యాదయ్య 14వ వర్ధంతిని గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యాదయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎంకే నరేందర్, సురేష్‌గౌడ్, నరేష్ దుత్వాల, రాజు సుత్రావ్ తదితరులు పాల్గొన్నారు.

23న 'మైనార్టీ హక్కులు.. సేవ్ వక్ఫ్' కాన్ఫరెన్స్

గోల్కొండ: 'మైనార్టీ హక్కులు.. సేవ్ వక్ఫ్' అనే అంశంపై ఈనెల 23న కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నామని కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హజారీ పేర్కొన్నారు. ఈ కాన్ఫరెన్స్ రేతిబౌలి పిల్లర్ నం. 63 వద్ద ఉన్న రూప్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఉంటుందన్నారు.

యువజన కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి



ఉజైర్ మీర్జాబేగ్‌కు ప్రశంస పత్రం అందజేస్తున్న సుర్వి ద్వివేదీ, శివచరణ్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్: తెలంగాణ వ్యాప్తంగా యువజన కాంగ్రెస్‌ను క్షేత్రస్థాయిలో పటిష్టం చేయాలని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ఇన్‌చార్జి సుర్వి ద్వివేదీ అన్నారు. అఖిల భారత యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు కొనసాగిన 'యువక్రాంతి.. బునియాదీ'ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా గోషామహల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉజైర్ మీర్జాబేగ్‌కు ఆయన ప్రశంస పత్రం అందజేశారు. గోషామహల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఉజైర్ మీర్జాబేగ్‌ను రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్ రెడ్డి అభినందించారు.

ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయం



ప్రజల సమస్యలు వింటున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ప్రజల సమస్యల పరిష్కారామే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం ఉదయం ఆయన టోలిచౌకీ మెరాజ్ కాలనీలోని తన కార్యాలయంలో తనను కలవడానికి వచ్చిన వారిని సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాలలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఎవరికి ఎటువంటి సమస్యలు లేకుండా అభివృద్ధి పనులు చేయించుకుంటూ ముందుకు సాగుతున్నానని అన్నారు. ప్రధానంగా మంచినీటి సరఫరా విషయంలో ఎక్కువగా తనకు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఈ ఫిర్యాదులను సైతం తాను వెనువెంటనే జలమండలి అధికారుల దృష్టికి తెచ్చి పరిష్కరిస్తున్నానని పేర్కొన్నారు. వేసవిలో నీటి సరఫరా విషయంలో అంతరాయం లేకుండా చూస్తానన్నారు. అందులో భాగంగానే షేక్‌పేట్, గుడిమల్కాపూర్ తదితర ప్రాంతాలలోని నీటి రిజర్వాయర్లను పరిశీలించామని తెలిపారు. ఆయన వెంట కార్పొరేటర్ నసీరుద్దీన్, ఆలీముద్దీన్ తదితరులు ఉన్నారు.

'క్రీడలపై యువతకు ఆసక్తి పెరిగింది'

గోల్కొండ: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న క్రీడా పాలసీ కారణంగా దేశంలో అన్ని రకాల క్రీడా పోటీల పట్ల యువత ఆసక్తి చూపిస్తోందని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం ఆయన తాళ్లగడ్డ కబడ్డీ స్టేడియంలో జరుగుతున్న ఛత్రపతి శివాజీ కుస్తీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ వేదికలపై భారత పైల్వాన్‌లు సత్తా చాటుతూ పతకాలు సాధిస్తున్నారని అన్నారు. ప్రధాని మోదీ క్రీడలకు ఇస్తున్న ప్రాధాన్యం వల్లే ఇది సాధ్యమవుతోందని అన్నారు. గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులు దేవర వంశీ కుస్తీ పోటీలు నిర్వహించడం అభినందనీయమని కితాబిచ్చారు.



ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిని సన్మానిస్తున్న దేవర వంశీ తదితరులు

యువ, ఔత్సాహిక కుస్తీ యోధులకు మంచి శిక్షణ ఇప్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజీ కుస్తీ పోటీల ఆర్గనైజర్ దేవర వంశీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శివాజీ మహరాజ్ శోభాయాత్ర



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

రహమత్‌నగర్ : భారత్‌సేనా ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని పురస్కరించుకుని బుధవారం రాత్రి నిర్వహించిన శోభాయాత్ర వైభవంగా సాగింది. మోతీనగర్ నుండి ప్రారంభమైన యాత్ర బోరబండ బస్ స్టాండ్ వరకు కొన సాగింది. శివాజీ మహారాజ్ అభిమానులు, బీజేపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు బంగారు శృతి, లంకల దీపక్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు డా. గౌతంరావు, నాయకులు బంగారు ప్రశాంత్, కుంభాల గంగరాజు, కొలన్ సత్యనారాయణ, షర్మిల జాదవ్, కొత్త వెంకటేశ్ గౌడ్ కృష్ణ మో హన్ తదితరులు పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటరమణ, బోరబండ ఎస్‌హెచ్‌ఓ వీరశేఖర్ సిబ్బందితో కలిసి బందోబస్తు నిర్వహించారు.

బీసీల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

- బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్
- కార్వాన్ నియోజకవర్గంలో కులగణన సర్వే పరిశీలన

గోల్కొండ: బీసీల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. గురువారం ఆయన కార్వాన్ నియోజకవర్గంలో ఇంటింటికి తిరిగి కులగణన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉప్పర్‌బస్తీ, ఆర్యసమాజ్, టోలి మసీదు, బాంజావాడి తదితర ప్రాంతాల్లో ప్రతి ఇంటికి వెళ్లి వివరాలను అడిగి నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణనపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ధృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. సంవత్సర కాలం నుంచి బడ్జెట్‌లో బీసీ సంక్షేమానికి వేల కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదులు రాకముందే పూర్తయిన కులగణన సర్వేను మళ్లీ చేయించడం ఆయన ధృడచిత్తానికి నిదర్శనమని అన్నారు. కులగణన పూర్తి చేయడం కోసం ముఖ్యమంత్రి ఎన్నికలను సైతం వాయిదా వేశారని పేర్కొన్నారు.



కుల గణనలో భాగంగా ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరిస్తున్న జి.నిరంజన్

బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధత మరే పార్టీకి లేదు..

బీసీలపై కాంగ్రెస్‌కు ఉన్న నిబద్ధత మరే పార్టీకి లేదని ఆయన అన్నారు. సెక్యూలర్ పార్టీ అయిన కాంగ్రెస్‌కు ప్రజా సంక్షేమం బాగా తెలుసన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు, వికలాంగులను ఆయన కలిశారు. ప్రభుత్వం నుంచి మీకు ఆసరా ఫింఛన్‌లు వస్తున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ, వినోద్‌సింగ్, జి.కిషన్, ప్రేమ్‌కిషోర్, వనజ, షకీలా, హేమలత తదితరులున్నారు.

పోలీసులు అంటే ప్రజల్లో నమ్మకం కలిగించాలి



ట్రైనీ ఐపీఎస్‌లతో మాట్లాడుతున్న గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

- గోల్కొండ ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: పోలీసులు విధి నిర్వహణలో ఎప్పుడు అప్రమత్తంగా ఉండాలని గోల్కొండ డివిజన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. గురువారం ఆయన గోల్కొండలోని తన కార్యాలయంలో నలుగురు ట్రైనీ ఐపీఎస్‌లకు విధి నిర్వహణ, ప్రజల రక్షణ, భద్రత తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల రక్షణకే ప్రధాన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. దీని కోసం విధి నిర్వహణలో ప్రతిదానికి సిద్ధపడి ఉండాలన్నారు. పోలీసులు అంటే ప్రజల్లో నమ్మకం కలిగించాలన్నారు. అసాంఘిక కార్యక్రమాలు, నేరాలకు పాల్పడే వారి పాలిట పోలీసులు యమదూతలుగా వ్యవహరించాలని అన్నారు. విధి నిర్వహణలో ఎంతటి కఠిన పరిస్థితులైనా సరే నిరుత్సాహ పడకుండా అంతిమ ఫలితం సాధించే వరకు పని చేయాలని సూచించారు. బాధితుల రక్షణ విషయంలో వారికి న్యాయం చేకూర్చాలన్నారు. నేరాల నియంత్రణకు ప్రజలతో మమేకం కావాలన్నారు.

నేరస్తులను పట్టుకోవడంలో ఏఐ కీలక భూమిక..

◆ నేర పరిశోధనలో ఎన్నో కొత్త విధానాలు వచ్చాయని సాంకేతిక పద్ధతిలో నేర పరిశోధన మరింత వేగం అవుతుందన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) సైతం నేడు నేర పరిశోధనలు, నేరస్తులను పట్టుకోవడంలో కూడా ప్రముఖ భూమిక పోషిస్తుందన్నారు. నేడు దేశంలో యువ అధికారులు తమ సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారని తెలిపారు. నేరస్తులను పట్టుకోవడంలో వారు చూపే ధైర్య సాహసాలను ప్రజలు అభినందిస్తున్నారని అన్నారు. పోలీసు శిక్షణలో తెలుసుకున్న విషయాలను ఆవలింపు చేసుకోవాలన్నారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించిన వారే వారే ఉన్నతాధికారుల మన్ననలు పొందుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం

లంగర్‌హౌస్: లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పోటాపోటీగా కారులో పెద్ద శబ్దంతో పాటలు పెట్టుకోవడంతో గొడవ జరిగింది. ఈ క్రమంలో మరో కారులో వ్యక్తులు ఇంకో కారులో ఉన్న వ్యక్తిపై దాడి చేశారు. ఈ ఘటనలో ఓ వ్యక్తి మృతిచెందిన విషయం తెలిసిందే. అయితే గురువారం పోలీసు బందోబస్తు నడుమ ఉస్మానియా వైద్యులు పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు.

◆ గోల్కొండలో నివాసముండే మొహమ్మద్ ఖిజర్ ఈనెల 15వ తేదీన కారులో వెళ్తుండగా పోటాపోటీగా మరో కారులో పాటలు ఎక్కువ శబ్దంతో పెట్టుకున్నారు. హారన్‌లు మోగిస్తూ ఒకరికొకరు వాగ్వాదానికి దిగారు. ఈ క్రమంలో మరో కారులో ఉన్న వ్యక్తులు ఖిజర్‌పై దాడి చేశారు. లోపల గాయాలతో ఇంటికి వెళ్లిన అతను ఒక గంట తరువాత మైత్రి ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆయన గుండెపోటుతో మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

◆ మూడు రోజుల తర్వాత గొడవ విషయం కుటుంబీకులకు తెలియడంతో.. అయితే ఈ గొడవ విషయం ఇంట్లో వారికి మూడు రోజుల తరువాత తెలిసింది. వారి దాడి కారణంగానే ఖిజర్ మృతిచెందినట్లు వైద్యులు కూడా తప్పుడు నివేదిక ఇచ్చారని కుటుంబీకులు లంగర్‌హౌస్ పోలీసులను ఆశ్రయించారు. సీసీ ఫుటేజీలో గొడవ దృశ్యాలు చూసిన పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం తహసీల్దార్ అహల్య, కలెక్టర్ కార్యాలయం నుంచి ఉపతహసీల్దార్ వెంకటేష్, ఏసీపీ సయ్యద్ ఫయాజ్, ఇన్‌స్పెక్టర్ రఘుకుమార్ సమక్షంలో పూడ్చిన మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిర్వహించారు. లంగర్‌హౌస్ పెన్షన్‌పుర దర్గాలో ఉస్మానియా వైద్యులు లక్ష్మీనారాయణ బృందం మృతుడి కుటుంబీకుల సమక్షంలో అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని మళ్లీ పూడ్చారు.

భక్తిశ్రద్ధలతో ధ్వజారోహణం



హోమంలో పాల్గొన్న చైర్మన్ మహేష్‌గౌడ్



ధ్వజారోహణ చేస్తున్న పురోహితులు

చాంద్రాయణగుట్ట: చాంద్రాయణగుట్టలోని చరిత్రాత్మకమైన స్వయంభూ లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలలో అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దేవాలయంలో గురువారం ఆలయ ప్రధాన అర్చకులు కంజర్ల ప్రతాపాచార్యులు హోమం, ధ్వజారోహణం నిర్వహించారు. రాత్రి పల్లకీలో ఉత్సవ మూర్తులను ఊరేగించారు. శుక్రవారం ఉదయం 11గంటలకు స్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం ఉంటుందని ఆయన తెలిపారు. ఈ వేడుకకు రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నట్లు కమిటీ చైర్మన్ మహేష్‌గౌడ్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు బి.వందన, విజయలక్ష్మీ, శ్రీధర్, శైలేష్, స్థానిక నాయకులు రాజు ముదిరాజ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అనిల్ రావిపూడికి విజయకృష్ణ సిల్వర్‌క్రౌన్ అవార్డు



దర్శకుడు అనిల్ రావిపూడికి అవార్డును అందజేసిన స్పీకర్ గడ్డం ప్రసాద్

గన్‌ఫౌండ్రీ: హాస్యం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం రవీంద్రభారతిలో శృతిలయ సీల్‌వెల్ కార్పొరేషన్, కళాకారులు ఐక్యవేదిక ఆధ్వర్యంలో ప్రముఖ దర్శకురాలు విజయనిర్మల జయంతి, దర్శకుడు జంధ్యాల 75 సంవత్సరాల వజ్రోత్సవ సంచిక ఆవిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సినీ దర్శకుడు అనిల్ రావిపూడికి విజయకృష్ణ సిల్వర్ క్రౌన్ అవార్డును అందజేశారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ..... విజయనిర్మల, జంధ్యాలను తెలుగు ప్రజలు చిరస్థాయిగా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. అంతకు ముందు గాయనీ గాయకుల సినీ సంగీత విభావరి ఆహూతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మా అసోసియేషన్ అధ్యక్షుడు మంచు విష్ణు, సినీ నటులు నరేష్, పవిత్ర లోకేష్, శ్రీలక్ష్మి, శివబాలాజీ, ప్రదీప్, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దామోదర్‌గుప్తా, కళాపత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, శృతిలయ ఆర్ట్స్ అకాడమీ చైర్మన్ బి.భీమ్‌రెడ్డి, వ్యవస్థాపక కార్యదర్శి ఆమని తదితరులు పాల్గొన్నారు.